క్లుప్తంగా

వ్యాసరచనలో సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం అటవీ దాని ప్రాముఖ్యతపై కలెక్టరేట్‌లో అధికారులు ఏర్పాటు చేసిన వ్యాసరచనలో పట్టణానికి చెందిన సిద్దార్థ్. పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇ ందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అభినందించారు.

పుస్తకాల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలు, తండాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంఆర్సీలో అధికారులు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మొదటి విడతగా కౌడిపల్లి మండలానికి 36,403 పుస్తకాలు అవసరం ఉండగా 21,389 పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ బుచ్యానాయక్ తెలిపారు. దీంతో పాటు చిలిప్‌చెడ్ మండలానికి 18,926 పాఠ్యపుస్తకాలకు 11,005 పుస్తకాలు వచ్చినట్లు చెప్పారు.

లయన్స్‌క్లబ్‌కు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న క్లబ్ అధ్యక్ష కార్యదర్శి, కోశాధికారి

నర్సాపూర్: ఉత్తమ సేవలందించిన తమ క్లబ్‌కు పలు అవార్డులు వచ్చాయని నర్సాపూర్ లయన్స్‌క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు అధ్యక్షుడు బుచ్చేష్‌యాదవ్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. తమ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు గాను క్లబ్ అధ్యక్షుడిగా తనతో పాటు కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి జైపాల్‌లకు అవార్డులను లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డి గవర్నర్ గంధని శ్రీనివాస్, మాజీ గవర్నర్ డాక్టర్ రామకృష్ణారెడ్డిలు అభినందించి అవార్డులు అందజేశారని ఆయన చెప్పారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ప్రతిపక్షాలు



మాట్లాడుతున్న అంచనూరి రాజేశ్

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, టెలికం బోర్డు మాజీ సభ్యుడు అంచనూరి రాజేశ్ పేర్కొన్నారు. ఆయన సోమవారం నార్సింగి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. వెనకబడిన వర్గాల జీవన ప్రమాణాల పెరుగుదల కోసం ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకుందన్నారు. దరఖాస్తుదారులు వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ పథకంపై కొందరు లేనిపోని ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రకటనలను ప్రజలు నమ్మొద్దని సూచించారు.

చదువుతో ఏదైనా సాధ్యం



అవగాహన కల్పిస్తున్న సక్రుబాయి

చిలప్‌చెడ్(నర్సాపూర్): చదువుకుంటేనే జీవితంలో ఎలాంటి సమస్యైనా ఎదుర్కొంటామని, ఏదైనా సాధించగలుగుతామని కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ సెంటర్ ఫర్ యాక్షన్ రిసెర్చ్ పీపుల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ సక్రుబాయి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని కేజీబీవీ విద్యార్థులకు బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గోపాల్‌రెడ్డి, కార్యదర్శి తిరుపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా సక్రుబాయి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. ఆడపిల్లలను లైంగిక వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లల అక్రమ రవాణా, అమ్మకాలు చేస్తే శిక్షకు గురవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఓ మామహేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

రామాయంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలనే డిమాండ్‌తో అఖిలపక్ష ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 85 రోజులకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు కుల సంఘాలతోపాటు యువజన, వ్యాపార సంఘాలు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.



రామాయంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫైజాబాద్‌లో మొక్క నాటుతున్న ఎంపీపీ వినోద, సర్పంచ్ మనోహర



చేగుంట(తూప్రాన్): పొలంపల్లి అర్బన్ పార్క్‌లో ..

ప్రకృతి సంపద అందరి బాధ్యత

- ఊరూరా ఉత్సాహంగా హరితోత్సవం
- జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత



తూప్రాన్: ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్



తూప్రాన్: హరితోత్సవంలో అధికారులు, నాయకులు

తూప్రాన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని ఇమాంపూర్‌లో హరితోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, గడా ప్రత్యేకాధికారి ముత్యం రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, క్రీడా మైదానంలో మొక్కలు నాటారు. అలాగే అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ,, సీఎం కృషి ఫలితంగా రాష్ట్రంలో 24 శాతం ఉన్న అటవీ ప్రాంతం హరితహారం ద్వారా నేడు 33శాతానికి చేరుకోవడం గగొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వెంకట శైలేశ్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఎస్ఐ సురేశ్ కుమార్, ఎంపీపీ స్వప్న వెంకటేష్, ఎంపీడీఓ అరుంధతి, నాయకులు, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రామాయంపేటలోని కేసీఆర్ కాలనీ వద్ద మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ హరితహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు పడకల ఇళ్ల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, కమిషనర్ ఉమాదేవి, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, తహసీల్దార్ మన్నాన్, రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



మెదక్‌జోన్: డిగ్రీకళాశాల ఆవరణలో..



వెల్దుర్తి(తూప్రాన్): మంగళపర్తిలో..



కొల్చారంలో..



పెద్దశంకరంపేట(మెదక్): మొక్కలు నాటుతున్న సీఐ జార్జ్, ఎంపీపీ శ్రీనివాస్



కౌడిపల్లి(నర్సాపూర్): మొక్కలు నాటుతున్న దృశ్యం



పాపన్నపేట(మెదక్): మల్లంపేటలో .



అల్లాదుర్గం(మెదక్): కాయిదంపల్లిలో..



శివ్వంపేట(నర్సాపూర్): మొక్కలు నాటుతున్న ఎంపీపీ హరికృష్ణ

వైభవంగా గ్రామదేవతలకు బోనాలు



బోనాలతో భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కమలాపూర్‌లో గ్రామదేవతలకు సోమవారం బోనాలను ఊరేగించి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుంట్ల రాములు, ఎంపీటీసీలు స్వప్నరాజేశ్, వీణసుభాష్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాములు, ఎస్ఐ బాలరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చేగుంటలో 21న మంత్రి హరీశ్‌రావు పర్యటన



డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు మంత్రి హరీశ్‌రావు ఈ నెల 21న రానున్నారని ఎంపీపీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మంత్రి పర్యటన సందర్భంగా చేగుంటలో డబుల్ బెడ్రూం ఇళ్ల స్థలాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జయరాజ్, జెడ్పీటీసీ శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, ఎంపీడీఓ ఆనందమేరి, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకటలక్ష్మీ, పీఆర్ ఈఈ, డీఈ, ఏఈ తదితరులు ఉన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



మెదక్‌జోన్: డీసీసీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు



నర్సాపూర్‌లో..

మెదక్‌జోన్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు సోమవారం పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి. పట్టణంలో పీసీసీ నేత మేడం బాలకృష్ణ చర్చి ఆవరణలోని సంధ్యా నిలయంలో కేక్ కట్‌చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, శ్యాంసుదర్, హఫీజ్,వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, మెదక్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ సల్మాన్, సోషల్ మీడియా జిల్లా కో కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్: పట్టణంలో రాహుల్‌గాంధీ పుట్టినరోజు సంబరాలను నిర్వహించిన వారిలో తెలంగాణ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, సురేశ్‌నాయక్, చందన్‌రెడ్డి, చిన్న అంజిగౌడ్, నర్సింగ్‌రావు, అశోక్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీలో నిర్వహించిన రాహుల్‌గాంధీ జన్మదినం వేడుకల్లో పీసీసీ సభ్యులు సుప్రభాతరావు, మ్యాడం బాలకృష్ణ, నాయకులు పోచయ్య, స్వామి, అల్లాడి వెంకటేశ్, బాబు, శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్, తదితరులున్నారు.

పల్లె దవాఖానా ఆకస్మిక తనిఖీ

తెరుచుకోని ఆస్పత్రి తలుపులు



గవ్వలపల్లిలో తాళం వేసిన దవాఖానా ఫొటో తీస్తున్న మెడికల్ ఆఫీసర్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి గ్రామంలో మె డికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు పల్లె దావాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు వచ్చారు. కానీ దవాఖానాకు తాళం వేసి ఉంది. దీంతో చేసేది లేక ఓ ఫొటో తీసి వెనుదిరిగారు. పల్లె దావాఖానాను సరైన సమయానికి తీయకపోవడంతో తాళం వేసిన ఆస్పత్రి భవనం ఫొటో తీసుకున్నారు. మండలంలోని పల్లె దావాఖానాలు సమయానికి తీసి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఎనిమిదేళ్ల మద్యనిషేధానికి తూట్లు

మద్యం అమ్మకాలపై మహిళల ఆగ్రహం

అల్లాదుర్గం(మెదక్): గ్రామంలో బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మకాలు నిషేధించి ఎనిమిదేళ్లు గడిచింది. కానీ కొందరు నేతల అండదండలతో అక్రమ మద్యం అమ్మకాలు మళ్లీ మొదలయ్యాయి. మద్యం సేవించి మహిళలపై అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని వెంకట్‌రావ్‌పేట గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో నాలుగు బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మకాలు చేపడుతుండటంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తమ ఇబ్బందులను గుర్తించి జిల్లాకు మహిళా ఎస్పీ ఉన్నందున యథావిధిగా మద్యం నిషేధించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంత్రాలు చేయడానికి వచ్చాడని..

వ్యక్తిని చితకబాదిన గ్రామస్తులు



నిర్బంధంలో ఉన్న వ్యక్తి

రామాయంపేట(మెదక్): మంత్రాలు చేయడానికి వచ్చిన ఓ వ్యక్తిని చితకబాదిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఒక కుటుంబం కొంతకాలంగా ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరి సూచన మేరకు ఇంటిలో బాగు చేయించుకోవడానికి సిద్దిపేట జిల్లా నారాయణరావుపేటకు చెందిన యాదగిరి అనే వ్యక్తిని సంప్రదించారు. అతను బాధిత కుటుంబం ఇంట్లో పూజలు చేయడానికి లక్ష్మాపూర్ వచ్చాడు. అతను వస్తూ.. పక్కనే ఉన్న కాట్రియాల గ్రామంలో పండితోపాటు , కొబ్బరికాయ, పసుపు, కుంకుమ తీసుకొచ్చాడు. అర్ధరాత్రి బాధితుని ఇంటిలో తవ్వకాలు కొనసాగిస్తున్న సమయంలో కాలనీవాసులు అతన్ని నిలదీశారు. మంత్రాలు చేయడానికి వచ్చావా అంటూ చితకబాదారు. యాదగిరితోపాటు వచ్చిన యువకుడిని ఎస్సీ కమ్యూనిటీ హాలులో రాత్రంతా నిర్బంధించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రంజిత్ నిర్బంధంలో ఉన్నవారిని విడిపించాడు. ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఎస్ఐ చెప్పారు.

‘రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన సీఎం’



మాట్లాడుతున్న మ్యాడం బాలకృష్ణ

రామాయంపేట(మెదక్): ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన సీఎం కేసీఆర్ భవిష్యత్ తరాలకు తీరని అన్యాయం తలపెడుతున్నాడని పీసీసీ సభ్యుడు సుప్రభాతరావు, మ్యాడం బాలకృష్ణ విమర్శించారు. సోమవారం రామాయంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సీఎం ప్రజాధనాన్ని దుర్వినియోగపరుస్తున్నాడని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ రంగంలో అభివృద్ధి సాధించలేదని, అభివృద్ధి కేవలం కాగితాల్లోనే ఉందన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 22న జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు రొయ్యల పోచయ్య, పట్టణ మాజీ అధ్యక్షుడు డాకి స్వామి, కార్యదర్శి అల్లాడి వెంకటేశ్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి, ఇతర నాయకులు బాబు, నాగేందర్, చింటూ, సంపత్, జయంత్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

సర్వర్‌డౌన్‌తో తప్పని తిప్పలు



నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధ్రువపత్రాల కోసం పడిగాపులు



కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద..



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దరఖాస్తుదారులు

నర్సాపూర్: ధ్రువపత్రాల కోసం మీసేవా కేంద్రాల వద్ద, తహసీల్దార్ కార్యాలయాల వద్ద లబ్ధిదారులకు పడిగాపులు తప్పడం లేదు. సర్వర్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకొని ఆయా ధ్రువపత్రాలు లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.సర్టిఫికెట్ల జారీలో జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలేజీల్లో చేరేందుకు, ప్రభుత్వం బీసీ కుల వృత్తులకు ఇస్తానన్న ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసేందుకు గడువు దగ్గర పడడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సర్వర్ పనితీరును మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లు ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్‌లపై వెళ్లడంపై నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ వచ్చి కాంగ్రెస్ నాయకులకు నచ్చ చెప్పి ధర్నా విరమించాలని సూచించగా, వారు ధర్నా విరమించారు. ధర్నా చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, మల్లేశ్, శ్రీనివాస్‌గుప్తా, అశోక్, రెడ్డిపల్లి అశోక్, చిన్న అంజిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని పలు గ్రామాలకు చెందిన గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సర్వర్ డౌన్‌తో లబ్ధిదారులు పడిగాపులు పడ్డారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రైవేట్ స్కూల్ ఎదుట ఏబీవీపీ ధర్నా

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ స్కూళ్లలో పాఠ్యపుస్తకాల అమ్మకాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలో ఏబీవీపీ కార్యకర్తలు సోమవారం అక్షర స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సంబంధిత శాఖ అధికారులు నిరుపేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని సంఘం నగర కార్యదర్శి ప్రశాంత్ ఆరోపించారు.

◆ నియామకం

కొల్చారం(నర్సాపూర్): మండల బీజేపీ దళిత, గిరిజన మోర్చా నూతన అధ్యక్షులను సోమవారం నియమించినట్లు మండలాధ్యక్షుడు దయాకర్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. దళిత మోర్చా అధ్యక్షుడిగా పోతుగళ్ల అశోక్, గిరిజన మోర్చా అధ్యక్షుడిగా సీతారాం తండా శ్రీధర్ రాథోడ్ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పార్టీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశం గౌడ్ ఎన్నికైన వారిని అభినందించారన్నారు.

◆ ఆర్థిక సాయం

పాపన్నపేట(మెదక్): మండలంలోని కొత్త లింగాయపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ కార్యకర్త బుడ్డ సాయిలు కుటుంబానికి సోమవారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. వీరి వెంట సర్పంచ్‌లు నవీన్, కిష్టయ్య, ఎంపీటీసీ సరస్వతి, శ్రీనివాస్, బాలాగౌడ్, వెంకటరామగౌడ్‌లున్నారు.

◆ ఉచిత కంటి వైద్య శిబిరం

తూప్రాన్: పురపాలక పరిధిలోని తూప్రాన్ టోల్ ప్లాజా సమీపంలో జీఎమ్మాఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ హైవే లిమిటెడ్ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. పుష్పగిరి కంటి ఆస్పత్రి సికింద్రాబాద్ సహకారంతో తూప్రాన్ ఎస్ఐ సురేశ్‌కుమార్, మనోహరాబాద్ ఎస్ఐ సందీప్‌రెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పోచంపల్లి హైవేస్ సిబ్బంది పరందామన్, ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్ రావు, ప్రవీణ్, సతీష్ కుమార్ పట్నాయక్, పుష్పగిరి కంటి ఆస్పత్రి కోఆర్డినేటర్ వేణు, ఫౌండేషన్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, టోల్ ప్లాజా సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

◆ ‘ఏం సాధించారని విద్యా దినోత్సవం’

పాపన్నపేట(మెదక్): సర్కార్ బడుల్లో కనీస సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వానికి విద్యా దినోత్సవం జరుపుకునే హక్కు లేదని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. శిథిలమైన బడుల్లో విద్యార్థులు భయం భయంగా చదువుకుంటున్నారని అన్నారు. తాగు నీరు, మూత్రశాలలు లేని బడులు ఎన్నో ఉన్నాయని చెప్పారు. దేశ ప్రధానిగా ఇందిరా గాంధీ నేతృత్వం వహించిన మెదక్ నియోజకవర్గంలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించిన ఘనత టీఆర్ఎస్‌దే నన్నారు.

◆ మున్నూరుకాపుల అభివృద్ధికి తోడ్పాటునందించాలి

వెల్దుర్తి(తూప్రాన్): మున్నూరుకాపుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందించాలని కోరుతూ మున్నూరు కాపు సంఘం సభ్యులు సోమవారం తహసీల్దార్ నాగవర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ ఆంజనేయులు, శ్రీకాంత్, శ్రీనివాస్, రమేశ్, శ్రీశైలం, నవీన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో మున్నూరు కాపులను కూడా బీసీ రుణాలను అందజేయాలని సోమవారం మండల తహసీల్దార్ ప్రభాకర్‌కు మున్నూరు కాపు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్దరాములు, దెశెట్టి లింగం, నాయిని వెంకటేశం, నాయిని లక్ష్మణ్, నాయిని మహేశ్, తాడెం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

◆ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం



వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఆరెగూడెం గ్రామ శివారులోని రాం శెట్టి చెరువు నుంచి ఆదివారం జేసీబీ సహాయంతో మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని సోమవారం ఇరిగేషన్ ఏఈ కవిత సందర్శించారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపిన, తరలించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.